
మీలాగే ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి...
ఓ ప్రభుత్వ ఉద్యోగస్తుని కొడుకుగా పెరిగి...
విద్యార్థి, యువజన నాయకుడిగా ఎదిగి...
ప్రజాసేవకే అంకితమైన మీ పాలమూరు బిడ్డగా
నన్ను ఆశీర్వదించండి..!
మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించండి.
మీ చల్లా వంశీచంద్ రెడ్డి
హస్తం గుర్తుకే
మన ఓటు
2
చల్లా
వంశీచంద్ రెడ్డి
పోలింగ్ తేది : 13 మే 2024
ఉ: 7:00 గం.ల నుండి సా. 6:00 గం.ల వరకు

విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూరు/అమరచింత, మే12: ద్విచక్ర వాహనంపై వెళ్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొట్టుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలం గూడూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు, బీసన్నలు గద్వాల మండలంలో వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గూడూరు గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఆదివారం గద్వాల జిల్లాకు బయలు దేరారు. ఈ క్రమంలో అమరచింత మండలంలోని చంద్రగట్టు శివారులోని ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు (35) అక్కడికక్కడే మృతి చెందగా బీసన్న తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బంధువులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

అచ్చంపేటటౌన్, మే 12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గ్రాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన బుచ్చయ్య అచ్చంపేట పట్టణానికి వచ్చి తిరిగి తన ద్విచక్ర వాహనంపై మన్ననూర్‌కు వెళుతుండగా అటవీశాఖ కార్యాలయం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి స్థానికులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్లాల్లోనే ధాన్యం

- ఒక్కసారిగా పడిపోయిన ధరలు
- వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతుల ఆందోళన

ఆత్మకూరు, మే 12: వర్షాభావ పరిస్థితులు ఒకవైపు ఎండల తీవ్రత మరోవైపు ఉన్నా ఆరుగాలం కష్టపడి రైతన్న పండించిన పంటకు నేడు గిట్టుబాటు ధరలు లేక కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉంచుకునే దుస్థితి నెలకొంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు అంతంతమాత్రంగా పండిన సన్నరకాలకు అధికంగా ధరలు ఉండడంతో రబీ సీజన్‌లో కూడా అదే ధరలు ఉంటాయని ఆశించిన రైతులు జూరాల ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయకపోయినా కాలువ పరిసర ప్రాంతాల, బోరు బావుల క్రింద రైతులు సన్న రకాలను సాగు చేశారు. మార్చి చివరి మాసం ఏప్రిల్ మొదటి మాసంలో వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2400 నుంచి రూ. 2600 వరకు మద్దతు ధర రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా రావడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురాకుండా రైస్ మిల్లర్లు కమీషన్ ఏజెంట్లకు ధాన్యాన్ని విక్రయించారు.

సార్వత్రిక ఎన్నికల కారణంగా..

ఏప్రిల్ మూడో వారం నాటికి ఒక్కసారిగా ధాన్యం ధరలు రూ. 2,200లకు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎకరాకు రూ. 30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే కనీసం 20 నుంచి 25 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో 45రోజులుగా రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. ధాన్యం రేటు ఒక్కసారిగా పడిపోవడానికి కారణమేంటని రైతులు, రైస్ మిల్లర్లను అడుగగా సార్వత్రిక ఎన్నికలు ఉండడంతో ఖరీదుదారులు రావడం లేదని, దీని ద్వారా మార్కెట్ నిలిచిపోయిందని సమాధానం ఇస్తున్నారు.

రూ. 500 బోనస్ ఇవ్వాలి

రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సింది పాలక ప్రభుత్వాలే ప్రతీ ఏటా ధాన్యానికి రూ. 100 నుంచి రూ. 120 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ ఇచ్చే బోనస్‌ను ఖరీఫ్ సీజన్ నుంచి ఇస్తామని ప్రకటించడం సరికాదని రైతులు అంటున్నారు. యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిందని, ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించే బోనస్‌ను రైతులు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న యాసంగి సీజన్‌లోనే ప్రకటిస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది కదా అని అంటున్నారు.


ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు


కల్లాల్లోనే నిల్వ ఉంచిన ధాన్యం రాశులు

ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వర్షాలు కురిస్తే వడ్లు తడిసిపోయే అవకాశం ఉంది. దీని ద్వారా ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పుకొని రాత్రింబవళ్లు కావలి కాసే పరిస్థితి దాపురించింది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట కోసి 40 రోజులు గడుస్తుంది



పంట కోసి 40 రోజులు గడుస్తుంది. కల్లాల్లోనే ధాన్యం రాశులకు కాపలాగా ఉంటున్నాం. మొదట్లో పచ్చి ధాన్యానికి రూ. 2400 పలికిన ధర వట్టి ధాన్యానికి కూడా అదే ధర ఇస్తామని అంటున్నారు. ఇదేంటని అడిగితే మార్కెట్ పడిపోయిందంటూ మిల్లర్స్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఎకరాకు రూ. 30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పండిస్తే కనీసం పెట్టుబడులు కూడా ఎల్లని పరిస్థితి ఏర్పడింది.

- దేవేందర్ , వరి రైతు

బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలి



కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకున్నప్పుడే పాలక ప్రభుత్వాలపై రైతులకు నమ్మకం కలుగుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ఇస్తామన్న బోనస్ రూ.500లను రబీ సీజన్‌లోనే ప్రకటిస్తే మద్దతు ధర, బోనస్ కలిసి క్వింటాల్‌కు రూ. 2700 ధర వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే ధాన్యానికి బోనస్‌ను ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- ఎస్.రాజు, సీపీఎం జిల్లా నాయకులు

ఉద్యోగికి అస్వస్థత

అచ్చంపేట, మే 12: పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరైన ఆర్ అండ్ బీ జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి ఆదివారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఒక్కసారిగా అస్వస్థత కు గురై పడిపోవడంతో అక్కడే ఉన్న వైద్యాధికారి తారాసింగ్ సీపిఆర్ చేసి వైద్యం అందించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


అస్వస్థతకు గురైన వ్యక్తికి వైద్యం అందిస్తున్న వైద్యాధికారి తారాసింగ్

ప్రమాదవశాత్తు చెరకు పంటకు నిప్పు

-12ఎకరాలల్లో చెరకు పంట అగ్నికి ఆహుతి

తాడూరు, మే 12 : మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, జోగిరెడ్డి, జనార్దన్‌రెడ్డిలు సాగు చేసుకున్న ఎనిమిదిఎకరాల చెరకు పంటకు నిప్పు అంటుకుంది. మంటలు రేగడంతో గమనించిన గ్రామస్థులు, రైతులు ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చినప్పటికీ వారు ఆ సమయంలో బిజీగా ఉండడం మూలంగా సమయానికి రాలేకపోయారు. దీంతో చెలరేగిన మంటలకు గాలి తోడవడంతో మరింత వేగంగా పంట మొత్తం నిప్పు అంటుకుని అగ్నికి ఆహుతైంది. దీంతో ఆరుగాలం కష్టపడి చేతికొచ్చే సమయంలో చెరుకు పంట పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో సాగు చేసుకున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటకు నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తాడూరు మండలం తుమ్మలసూగురు గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అవుతున్న చెరకు పంట

విద్యుదాఘాతంతో కూల్‌డ్రింక్ షాపు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన కూల్‌డ్రింక్ షాపు

లింగాల, మే 12 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల గ్రామ సచివాలయం వద్ద మార్కెట్‌లో గల కూల్ డ్రింక్ షాపు విద్యుదాఘాతంతో దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కూల్ డ్రింక్ షాపు యజమాని జబ్బార్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శనివారం కూల్ డ్రింక్ షాపులో రాత్రి తొమ్మిది గంటల వరకు అమ్మకాలు నిర్వహించి షాపునకు తాళం వేసి వచ్చామన్నారు. ఆదివారం ఉదయం షాపులో నుంచి మంటలు, పొగలు వస్తుండడాన్ని గుర్తించిన వారు తమకు సమాచా రమందించడంతో వెళ్లి చూడగా షాపులో గల పెద్ద కూలర్, కూలింగ్‌కు సంబంధించిన యంత్రాలు, పరికరాలు, ఫర్నీచర్ కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమైనట్లు వెల్లడించారు. షాపు పాక్షికంగా దెబ్బతినగా సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. షాపులో విద్యుత్ వినియోగంలో అన్ని జాగ్రత్తలు పాటించిన షార్ట్ సర్క్యూట్ ఏర్పడటం తమను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- రూ. 60వేలు అపహరణ


చెల్లాచదురుగా వేసిన వస్తువులు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 12 : తాళం వేసిన ఇంటికి కన్నం వేసి 55వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్ అపహరించుకెళ్లిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ కాలనీలో చోటు చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్న జీవన్ శనివారం మధ్యాహ్నం సొంత పని మీద కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. రాత్రి దాదాపుగా 10గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి తలుపులు విరగగొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కబడ్డీలో రాణిస్తున్న క్రీడాకారులు

- వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరం
- ఉదయం, సాయంత్రం ఇండోర్ స్టేడియంలో సాధన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 12 : వేసవి శిక్షణ శిబిరాలతో మైదానాలు, అకాడమీలు, ఇండోర్ స్టేడియాలు కళకళలాడుతున్నాయి. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 20పైగా వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా శాఖ సహకారంతో జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. క్రీడాశాఖ క్రీడాకారులకు ఉండేందు వసతి కల్పించడంతో కబడ్డీ సంఘం క్రీడాకారులకు ఇక్కడ భోజన వసతి కల్పించింది. ఉదయం, సాయంత్రం నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ కబడ్డీ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉండి ప్రోత్సహిస్తున్నారు. నెలాఖరు వరకు కొనసాగే ఈ క్యాంపుల్లో కబడ్డీ శిక్షణ ఇస్తూ మెళకువలు నేర్పుతుండడంతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికీ పలువురు గ్రామీణ క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


వేసవిలో శిబిరంలో శిక్షణ పొందుతున్న కబడ్డీ క్రీడాకారులు

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం



జిల్లాలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తాను. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నదే నా ఆకాంక్ష. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారుల కొదువ లేదు. వేసవి శిబిరాల్లో క్రీడాకారులు తమ ప్రతిభ చాటాలి. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటా.

- శాంతకుమార్, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. కబడ్డీ క్రీడాభివృద్ధికి శాంతకుమార్ సార్ సహకారంతో ఎంతో ఉంది. అందరి సహకరంతో కబడ్డీ క్రీడాభివృద్ధి మరింత కృషి చేస్తాం.

- కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ

శిక్షణ చాలా బాగుంది



ఇండోర్ స్టేడియంలో వేసవి కబడ్డీ శిబిరంలో శిక్షణ చాల బాగా ఇస్తున్నారు. కోచ్ సార్ రోజు ఉదయం,సాయంత్రం శిక్షణతో పాటు కబడ్డీపై అవగహన కల్పిస్తున్నారు. రాష్ట్రస్థాయి టోర్నీ ఆడాను. ఇటివలే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యాను. భవిష్యత్తు భారత జట్టుకు ఆడాలన్నదే నాలక్ష్యం.


- మౌనికా, కబడ్డీ క్రీడాకారిణి, రాజాపూర్

ప్రో కబడ్డీ ఆడాలని ఉంది



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వేసవి శిబిరాలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. కబడ్డీ సంఘం కృషితో రెండు సార్లు, రాష్ట్రస్థాయిలో, ఒక సారి జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. ప్రోకబడ్డీ ఆడాలని ఉంది.

- పాండునాయక్, అడ్డాకుల మండలం, తిమ్మాయిపల్లి తండా




నాగర్‌కర్నూల్‌లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయల్దేరుతున్న పోలింగ్ సిబ్బంది

నేడే లోక్ సభ పోలింగ్

- ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్
- పోలింగ్ స్టేషన్‌లకు తరలిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- వలస ఓటర్ల రాక
- పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై కేంద్ర బలగాల నిఘా
- మహబూబ్‌నగర్ పరిధిలో 31 మంది.. నాగర్‌కర్నూల్ పరిధిలో 19 మంది పోటీ


నాగర్‌కర్నూల్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

మహబూబ్‌నగర్, మే 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు నెల రోజులుగా హోరెత్తించిన ప్రచారానికి తెర పడింది. నువ్వా.. నేనా.. అన్నట్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. సవాళ్లు.. ప్రతి సవాళ్లు చేసుకున్నారు. సై అంటే సై అన్నట్లు ఎన్నికల కురుక్షేత్రంలో తలపడ్డారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియగా.. నేడు సోమవారం మరికొద్ది సేపట్లో ఓటింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పరిధిలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా కేంద్రాలకు కేటాయించిన సిబ్బందిని, ఎన్నికల సామగ్రి ఈవీఎంలు, వీవీపాట్‌లను పంపించారు.

భారీ పోలీస్ బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికలకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్రబలగాలను మోహరిస్తున్నారు. రెండు పార్లమెంట్‌ల పరిధిలో దాదాపు ఏడు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అందులో వెయ్యి మంది వరకు కేంద్రబలగాలు ఉన్నాయి. కర్ణాటక నుంచి కూడా కొంతమంది బలగాలను రప్పించారు. అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పోలింగ్ స్టేషన్‌లకు 100మీ దూరంలో ఎవరూ గుంపులుగా ఉండటానికి వీలులేదు. పోలింగ్ నిర్వహణ అనంతరం ఈవీఎంలు, వీవీపాట్‌లు స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలిచ్చారు. డీఐజీ, ఎస్పీలు బందోబస్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

ఎన్నికల విధులకు 14,491 మంది సిబ్బంది

నాగర్‌కర్నూల్, (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి సెగ్మెంట్లు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,38,254 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 8,64,034 మంది పురుషులు, 8,70,694 మంది మహిళలు, మిగిలిన వారు ఇతరులు ఉన్నారు. మొత్తం 2,057 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 14,491 మంది సిబ్బంది పోలింగ్ విధులు నిర్వహించనున్నారు.

ముగ్గురి మధ్యే ప్రధానమైన పోటీ

నాగర్‌కర్నూల్‌లో ముగ్గురి మధ్యనే ప్రధానమైన పోటీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లు రవి, బీఆర్ఎస్ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు తనయుడు భరత్‌ప్రసాద్ తలపడుతున్నారు. బీజేపీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు ప్రధానంగా ప్రచారం నిర్వహించారు. ఫలితం ఎలా ఉండబోతుందనే విషయంలో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఓటరు నాడిపై టెన్షన్

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలలో ఓటరు నాడి ఎటువైపు ఉంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 31 మంది, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు 19 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు బీఎస్పీ, స్వతంత్రులు కూడా జోరుగా ప్రచారం నిర్వహించారు.

ఓటర్లు ఇలా..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,80,348 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 8,20,016 కాగా, మహిళా ఓటర్లు 8,48,289 మంది ఉన్నారు. ఇతరులు 43 మంది ఉన్నారు. 1,937 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు.

తరలివస్తున్న వలస ఓటర్లు

ఎన్నికలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో వలస ఓటర్లను రప్పిస్తున్నారు. రాను, పోను చార్జీలు ఇస్తామని హైదరాబాద్, ముంబయి వంటి నగరాల్లోని ఓటర్లను పిలిపిస్తున్నారు. అందుకోసం స్థానిక నాయకులతో మాట్లాడుతున్నారు. ఆదివారం చాలామంది వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు చేరుకున్నారు.

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగనుండటంతో సిబ్బంది ఆదివారం సాయంత్రమే సామగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్‌లకు బయలుదేరి వెళ్లారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఈవీఎం, వీవీపాట్, ఇతర సామాగ్రి అందజేశారు. 32 బస్సులలో పోలీస్ బందోబస్తుతో వారిని బూత్‌లకు తరలించారు. కలెక్టర్ రవినాయక్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగేలా యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఉదయం 5:30 గంటలకల్లా అధికారులు పోలింగ్ స్టేషన్‌లకు చేరుకుని మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ సమయంలోగా ఎవరు వచ్చినా వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల అనంతరం పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎం, ఎన్నికల సామగ్రిని పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, పోలీసులు ఎన్నికలు సజావుగా కొనసాగేటట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ట్రైనీ కలెక్టర్ పాల్గొన్నారు.

● పట్టణంలోని టీడీగుట్టలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ ద్వారాన్ని పూలతో డెకరేషన్ చేసి, గ్రీన్‌మ్యాట్ పరిచారు.


ఎన్నికల సామగ్రితో వెళ్తున్న ఉద్యోగిని..


డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు


నాగర్‌కర్నూల్ నుంచి బస్సులో బయల్దేరుతున్న పోలింగ్ సిబ్బంది


నాగర్‌కర్నూల్‌లో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరుతున్న పోలింగ్ సిబ్బంది


డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఈవీఎం బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు తరలిన పీవో, ఏపీవోలు
- ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్
- 400 మంది పోలీస్ సిబ్బందితో పోలింగ్‌కు బందోబస్తు
- 23 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించిన పోలీస్ శాఖ

కొల్లాపూర్, మే 12 : సోమవారం జరిగే ఎంపీ ఎన్నికల పోలింగ్‌కు రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఏర్పాట్లు సిద్ధం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండల కేంద్రాల్లో 282పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వహించేందుకు 282 మంది పీవోలు, 282మంది ఏపీవోలు, 564మంది ఓపీవోలను నియమించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని పీజీ సెంటర్ వద్ద పీవో, ఏపీవో, ఓపీవోలకు కేటాయించిన ప్రాంతాలకు వెళ్లేందుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. వారికి ఈవీఎం బాక్సులను కేటాయించారు. తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వహించేందుకు పీవో, ఏపీవోలు, ఓపీవోలు తరలివెళ్లారు. ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ దగ్గరుండి పరిశీలించారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుడా 350మంది తెలంగాణ పోలీస్ సిబ్బందితోపాటు మరో 50 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయని తెలిపారు. ఈ బందోబస్తు డీసీఆర్‌బీ నాగర్‌కర్నూల్ డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించనున్నారన్నారు. ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలతోపాటు 350 మంది తెలంగాణ పోలీస్ సిబ్బంది మరో 50మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. నాలుగు మండల కేంద్రాల్లో 23మంది పోలింగ్‌స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్‌స్టేషన్లపై పోలీస్ గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసిందని కొల్లాపూర్ ఎస్‌ఐ రిషికేష్ పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్‌లో విధులు నిర్వహించేందుకు వచ్చిన పోలింగ్ సిబ్బందికి పట్టణంలోని మహబూబ్‌ఫంక్షన్ హాల్‌లో పోలింగ్ అధికారులు గ్రామాలను కేటాయించారు. ఈవీఎం బాక్సులతోపాటు పోలింగ్ సిబ్బంది కూడా పోలింగ్‌స్టేషన్లకు తరలి వెళ్లారు. ఈవీఎం డిస్టిబ్యూషన్ వద్ద ఆర్డీవో నాగరాజు, ఎమ్మార్వో శ్రీకాంత్, డీసీఆర్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ మహేష్‌లతోపాటు రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్

ఊర్కొండ ఓటర్లు 17,643

ఊర్కొండ: మండలంలో 17,643 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ చెన్నకిష్టన్న తెలిపారు. అందులో 8751 పురుషులు, 8892 మహిళలు ఉన్నారని పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఓటును సద్వినియెగం చేసుకోవాలని ఆయన కోరారు. మండలంలో 22 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించామని, పోలింగ్ సిబ్బందికి పూర్తి ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని 22 పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై వీరబాబు తెలిపారు.





ఈవీఎం బాక్సులతో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పీవోలు, ఏపీవోలు

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

లింగాల : మారుమూల గిరిజన ప్రాంతమైన లింగాల మండలంలో నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పోలీసు బందోబస్తు నడుమ మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల సిబ్బంది ఈవీఎం తదితర ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా నల్లమల అటవీ ప్రాంతంలో చెంచు ఓటర్ల సౌలభ్యం కోసం అదనంగా ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 30,904మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు అధికంగా 15.623మంది ఉన్నారు. పురుషులు 15,280మంది ఓటర్లున్నారు. అత్యధికంగా లింగాలలో ఆరు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయగా 6216 మంది ఓటర్లు, అత్యల్పంగా ఆగర్లపెంట 14మంది ఓటర్లున్నారు. మహిళలు అధికంగా లింగాలలో 3,210మంది, పురుషులు అత్యధికంగా లింగాలలో 3006మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో నాలుగు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు లింగాల, ధారారం, కోమటికుంట, అవుసలికుంట గుర్తించిన అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు చర్యలను చేపట్టారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఉమా వెల్లడించారు. వికలాంగులు, వృద్ధుల ఓటింగ్ శాతం పెంచేందుకు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, వీల్‌చైర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను అమలుపర్చుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

మండలంలో 33,167 ఓటర్లు

వంగూరు: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మండలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 33,167 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 16,355, మహిళలు 16,812 మంది ఉన్నారు. ఇందుకు గాను 51 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మండలంలో సోమవారం జరిగే పోలింగ్‌కు ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 60 మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మహిందర్ తెలిపారు.

నాలుగు సమస్యాత్మకమైన గ్రామాలు

అమ్రాబాద్: మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం 37 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా ఇందులో నాలుగు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మండల పరిధిలోని మన్ననూరులో 2, అమ్రాబాద్, జంగంరెడ్డిపల్లిలో ఒక్కొక్కటి చొప్పున గుర్తించి సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను నలుగురు చొప్పున (సీఆర్‌పీఫ్) సెంట్రల్ ఆర్మ్ పోలీస్ ఫోర్స్‌తో పాటు మొత్తం 69 మందిని పోలీసులను నియమించినట్లు అమ్రాబాద్ ఎసై రమేష్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం నాలుగు రూట్స్ ఏర్పాటు చేసి ఒక్కొక్క రూట్‌కు మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

315 మంది సిబ్బంది కేటాయింపు

అమ్రాబాద్, పదర మండలాల పరిధిలో సోమవారం ఎంపీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్రాబాద్ మండల పరిధిలో 44 బూత్‌లకు గాను 220 మంది సిబ్బందిని నియమించగా పదర మండలం పరధిలోని 19 పోలింగ్ బూత్‌లకు గాను 95 మంది సిబ్బందిని నియమించారు. సంబంధిత మండల అధికారులు పోలింగ్ సిబ్బందికి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయడంతో ఆదివారం సాయంత్రం వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లారు. అమ్రాబాద్ తహసీల్దార్ సరిత ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రమేష్ మండలంలోని మాధవానిపల్లి, వంగురోనిపల్లి, టీకే లక్ష్మాపురం తండా, టీకే లక్ష్మాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటరుకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం

బిజినేపల్లి : మండల కేంద్రంలోని 52వ పోలింగ్ బూత్‌ను అధికారులు ఆదివారం పూలు, బెలూన్స్‌తో సుందరంగా అలకరించి రెడ్ కార్పెట్ పరిచి స్వాగత తోరణంతో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ఆహ్వానించనున్నట్లు ఎంపీడీవో కతాలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్‌లు తెలిపారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు పోలింగ్ కేంద్రాలను వినూత్నంగా ఏర్పాటు చేయడంతో పాటు ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు.



బిజినేపల్లిలో మహిళా ఓటర్ల కోసం సుందరంగా తీర్చిదిద్దిన పోలింగ్ కేంద్రం

ఇబ్బంది పడ్డ సిబ్బంది

అచ్చంపేట, మే 12: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ, బూత్‌లకు సిబ్బంది కేటాయించడంలో అధికారులు ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల ఎన్నికల సిబ్బంది ఇబ్బంది పడ్డారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా అనుభావాలు ఎదురుకాలేదని ఎన్నికల విధుల కోసం వచ్చిన ఉపాధ్యాయులు, తదితర శాఖల ఉద్యోగులు వాపోయారు. సిబ్బంది హాజరు నమోదు వద్ద ఒక్కసారిగా ఎన్నికల సిబ్బంది రావడంతో సరియైన ఏర్పాట్లు లేక ఒకరినొకరు నెట్టుకొంటూ వారి పేర్లు నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలోని 339 పోలింగ్ బూత్‌లు ఉండగా, సిబ్బంది నియామకంలో అధికారులు ఇబ్బంది పడ్డారు. ఒక్కో బూత్‌కు ఒక పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలు ఉండవల్సి ఉండగా, పూర్తి స్థాయిలో నియమించకుండా కొందరు ఉద్యోగులకు ఇబ్బంది కలిగే విధంగా అధికారులు వ్యవహరించారని వారు ఆరోపించారు.

కలెక్టర్ ఉదయ్‌కుమార్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు చేరుకొని దగ్గర ఉండి సిబ్బందికి సలహాలు సూచనలను అందించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి గ్రామాలకు వాహనాలు వెళ్లేందుకు చాలా సమయమే పట్టింది. భోజనాల వద్ద కూడా సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.



వాటర్‌ట్యాంకు వద్దనే నీళ్లు పట్టుకొని తాగుతున్న సిబ్బంది

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో 8 మండలాల్లో 339 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1695 మందిని ఎన్నికల విధుల కోసం నియమించారు. 13 చెంచు పెంటలతో పాటు ప్రతీ గ్రామ పంచాయతీలో ఈసారి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

ఆర్‌డీవో మాధవి ఆధ్వర్యంలో తహసీల్దార్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల భద్రతకోసం రెండు సీఆర్‌పీఎఫ్ పోలీసులు, ఏఎస్పీ, డీఎస్పీ, పర్యవేక్షణలో ఆరుగురు సీఐలు, 16 మంది ఎస్‌ఐలతో మొత్తం 600 మంది పోలీసులను ఈ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 32 సమస్యాత్మక ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. 44 రూట్లు, 44మంది సెక్టోరియల్ అధికారులు, 10 మంది మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు.



డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద కూర్చొన్న సిబ్బంది



బస్సులు ఎక్కేందుకు సామగ్రితో వస్తున్న సిబ్బంది



ఎండకు అట్టను పెట్టుకొని వెళుతున్న సిబ్బంది

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం గతంలో 20 పోలింగ్ కేంద్రాలుండగా జాలువాయితండా ఒకటి, తడకలవారితండా ఒక పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. మొత్తం 22 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.



చారకొండలో మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీడీవో ఇసాక్‌హుసేన్



పెంట్లవెల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రంగా ముస్తాబు చేసిన అధికారులు



అమ్రాబాద్ ఠాణాలో సిద్ధంగా ఉన్న సీఆర్‌పీఎఫ్‌తో పాటు కర్ణాటక పోలీసులు

మండలంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

చారకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 21 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదివారం తహసీల్దార్ కేసీ ప్రమీల, ఎంపీడీవో ఇసాక్ హుసేన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలంలో 14, కల్వకుర్తి నియోజికవర్గం చారకొండ మండలంలో 7 మొత్తం 21 పోలింగ్ కేంద్రాల్లో 84 మంది సిబ్బందితో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వృద్ధులకు వీల్‌చైర్లు, తాగునీరు, విద్యుత్, నీడకోసం టెంట్లు తదతర సదుపాయాలు కల్పించినట్లు వారు తెలిపారు. చారకొండలో 9వ బూత్ మోడల్ పోలింగ్ కేంద్రంగా అదేవిధంగా మండలంలోని తుర్కలపల్లిలో 13వ బూత్ మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపికైనట్లు వెల్లడించారు. ఓటింగ్‌శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. మోడలింగ్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన 9వ, 13వ బూత్‌లను మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని వారు పేర్కొన్నారు. ఈవీఎం బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరుగకుండా 55 మంది పోలీస్‌సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

అన్నీ ఏర్పాట్లు పూర్తి

కల్వకుర్తి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ సెంటర్‌లో ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది 1705మందికి ఆదివారం అందజేశారు. పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రిని తీసుకొని ప్రత్యేక వాహనాల్లో పోలీసుల బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆర్డీవో ఎస్.శ్రీను పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,44,405మంది ఉన్నారని, అందులో పురుష ఓటర్లు 1,23,434 ఓటర్లు, మహిళా ఓటర్లు 1,20,970మంది, ట్రాన్స్‌జెండర్లు ఒకరు ఉన్నారని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మొత్తం 271 పోలింగ్ కేంద్రాల్లో 2,44,405మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించి నట్లు ఆర్డీవో ఎస్.శ్రీను పేర్కొన్నారు.

కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల ఆవరణలో ఎన్నికల నిర్వహణలో పోలీస్ సిబ్బందికి డీఎస్పీ పలు సూచనలు, సలహాలు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఇద్దరు సీఐలు, 10మంది ఎస్‌ఐలు, 320మంది పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు భద్రత చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏఆర్‌వో, ఆర్డీవో ఎస్.శ్రీను



ఏఆర్‌వో, ఆర్డీవో ఎస్.శ్రీను సమక్షంలో ఈవీఎంలను తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటు వేయడం మన బాధ్యత అని, జిల్లాలో వంద శాతం ఓటింగ్ జరగడానికి కృషి చేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నేడు జరిగే ఎన్నికలకు ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని వనపర్తి, అలంపూర్, గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉందని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, మే 12: మండల పరిధిలోని పిర్యాటోనిపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో లక్ష్మణ్, వెంకట్, తిరుపతయ్య, శ్రీను, అంజి, ఆంజనేయులు, సత్యం, మహేష్, సాయిబాబు, మద్దామయ్య, లింగమయ్య శివ, బాల్‌చంద్రి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. అనంతారెడ్డి, శేఖర్‌గౌడ్, కృష్ణయ్య, చంద్రమౌళి, మల్లయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడిగా రాజేందర్

కల్వకుర్తి, మే 12 : క్లాస్‌మేట్ క్లబ్ కల్వకుర్తి డివిజన్ అధ్యక్షునిగా రాజేందర్ ఎన్నికయ్యారు. కల్వకుర్తి పట్టణంలోని ఆదివారం క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడిగా రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా బాధ్యులు లక్ష్మీనరసింహారావు, సభ్యులు శోభన్‌బాబు, చిగుళ్లపల్లి శ్రీధర్, రాఘవేందర్, అశోక్, సతీష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యురాలి భర్త మృతి

కోడేరు, మే 12 : మండల పరిధిలోని జనుంపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పుల్లమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పగిడాల శ్రీనివాసులు పరామర్శించారు. ఆదివారం జనుంపల్లిని సందర్శించి జోగు నాగయ్య మృతదేహాన్ని ఆయన పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఓర్సు రామకృష్ణ, చెన్నయ్య, లక్ష్మణ్‌స్వామి, రామచంద్రయ్య, మల్లేష్, శివశంకర్, రాంభూపాల్ అదే గ్రామానికి చెందిన డీలర్ కృష్ణయ్య, మైపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ

కొల్లాపూర్, మే 12 : రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న విధంగా ఈ నెల 14 నుండి విద్యార్థినీ విద్యార్థులకు, యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణనిచ్చేందుకు కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ పేర్కొన్నారు. ఆదివారం మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేతూరి ధర్మతేజ మాట్లాడారు. ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్, డీటీపీ కోర్సులను కంప్యూటర్ శిక్షకులు భీమయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కొనసాగుతుందన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిపై పోలీసులకు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 12 : తనపై బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారాలు చేయిస్తున్నాడని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులుకు బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఫిర్యాదు చేశారు. తనపై అసత్యపు ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలుతీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కనుల పండువగా బీరప్ప దేవుని ఉత్సవాలు

పెద్దకొత్తపల్లి, మే 12 : మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో గొల్ల కురుమలు బీరప్ప ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని గొల్ల కురుమలు బీరప్ప దేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కొండ శ్రీనివాసులు 10 వేల రూపాయల నగదును గొల్ల కురుమలకు బీరప్ప ఉత్సవాలకు ఆర్థిక సహాయంగా అందజేశారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న బైక్ ఇద్దరికి తీవ్ర గాయాలు

ఊర్కొండ, మే 12: ఊర్కొండ మండలంలోని కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారిపై రేవల్లి గేటు వద్ద ధాన్యం కుప్పలకు అడ్డు పెట్టిన రాళ్లను బైకు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన ముర్తుజా (మున్నా), ఎండీ.నజీర్‌లు మిడ్జిల్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ జరిగిన శుభ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి వస్తున్న క్రమంలో రేవల్లి గేటు వద్ద వరి ఎండకు ఆరబెట్టి రాత్రి సమయంలో ఒకచోటికి చేర్చి దానిపై కవరు కప్పి గాలికి ఎగిరి పోకుండా రాళ్లు పెట్టారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనం వెలుతురులో ఏమి కనిపించపోవడంతో బైకు రాళ్లకు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వెనకాలే వస్తున్న బంధువులు వెంటనే గుర్తించి ప్రైవేటు వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముర్తుజా (మున్నా) పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి, అక్కడ చికిత్సకు ఇబ్బంది కావడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎండీ నజీర్ కల్వకుర్తిలోనే చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరబాబులు తెలిపారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ

తెలకపల్లి, మే 12 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌స్టేషన్‌లోని బూత్‌లను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి ఏర్పాటు చేసిన వసతులను పర్యవేక్షించారు. వసతులు సక్రమంగా ఉండే విధంగా చూడాలని ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు.